సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
బుధవారం ◆ 19 ◆ ఫిబ్రవరి ◆ 2025



గజానికో గుంత..!

పాడేరు నుంచి మైదాన ప్రాంతాలకు వెళ్లే ప్రధాన వడ్డాది రోడ్డులో పలు చోట్ల గుంతలు వాహనచోదకులను భయపెడుతున్నాయి. 8లో



రక్తదానంపై అపోహలు వద్దు

రక్తదానం చేయడం ద్వారా అత్యవసర పరిస్థితిల్లో మరొకరి ప్రాణాలను కాపాడేవారవుతారని కలెక్టర్ దినేష్‌కుమార్ తెలిపారు. 8లో



24 కేసుల మద్యం స్వాధీనం

డొంకరాయిలోని ఓ బెల్టుషాపునకు అక్రమంగా తరలిస్తున్న 24 కేసుల మద్యాన్ని చింతూరు ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 8లో

న్యూస్‌రీల్

పెరిగిన ఉష్ణోగ్రతలు

చింతపల్లి: మారుతున్న వాతావరణ పరిస్థితుల కారణంగా జిల్లాలో ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి. జి.మాడుగులలో 12.5 డిగ్రీలు, డుంబ్రిగుడలో 13.3, పాడేరు 13.6, హుకుంపేట, పెదబయలులలో 14.1, గూడెంకొత్తవీధి, ముంచంగిపుట్టులలో 14.9, చింతపల్లిలో 15.4 అరకులోయలో 15.9, అనంతగిరిలో 18.5 కొయ్యూరులో 19.5 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్టు చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనాస్థానం వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు.

కొత్త చింతపండు విక్రయాలు ప్రారంభం



వంట్లమామిడిలో విక్రయిస్తున్న చింతపండు

సాక్షి,పాడేరు: జిల్లాలో కొత్తచింతపండు విక్రయాలు ప్రారంభమయ్యాయి. పాడేరు ఘాట్‌లోని వంట్లమామిడి వద్ద గిరిజనులు చింతపండు అమ్మకాలను ప్రారంభించారు. రిటైల్‌గా కిలో రూ.50 ధరతో బుట్టలతో విక్రయిస్తున్నారు. ఘాట్‌రోడ్డులో ప్రయాణించే మైదాన ప్రాంత ప్రజలు,పర్యాటకులు కొత్త చింతపండును కొనుగోలు చేస్తున్నారు.గిరిజన సహకార సంస్థ కిలో చింతపండు ధర రూ.36గా ప్రకటించింది.మార్చి నెల నుంచి చింతపండు వ్యాపారం జిల్లా అంతటా జోరందుకోనుంది.

9 కిలోల కణితి తొలగింపు



కణితిని చూపిస్తున్న డాక్టర్ రాము

అరకులోయటౌన్: స్థానిక ఏరియా ఆస్పత్రిలో సూపరింటెండెంట్, జనరల్ సర్జన్ డాక్టర్ లగుడు రాము నేతృత్వంలో ఆపరేషన్ చేసి ఓ మహిళ అండాశయం నుంచి తొమ్మిది కిలోల కణితిని తొలగించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాము మాట్లాడుతూ డుంబ్రిగుడ మండలం బల్లగెడ్డ గ్రామానికి చెందిన పాంగి చిలకమ్మ మూడు సంవత్సరాలుగా పొత్తి కడుపు నొప్పి, వాపుతో బాధపడుతోందన్నారు. ఆమెకు మంగళవారం అరకు ఏరియా ఆస్పత్రిలో శస్త్ర చికిత్స నిర్వహించి 9 కిలోల అండాశయ కణితి తొలగించినట్టు చెప్పారు. గత ఆరు నెలల్లో అరకు ఏరియా ఆస్పత్రిలో ఇది రెండో అతి పెద్ద శస్త్ర చికిత్స అని చెప్పారు. ఈ ఆపరేషన్‌లో మత్తు వైద్యుడు డాక్టర్ అప్పారావు, స్టాఫ్ నర్సు మంగ, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

24న సర్టిఫికెట్ కోర్సులకు ఇంటర్వ్యూ

మురళీనగర్(విశాఖ): కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇనిస్టిట్యూట్(గైస్)లో నిర్వహిస్తున్న స్వల్పకాలిక సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశాలకు ఈ నెల 24న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2024–25 సంవత్సరానికి ఏడాది వ్యవధి కలిగిన పారిశ్రామిక భద్రత కోర్సులో 60 సీట్లు, 6 నెలల వ్యవధితో ఫైర్ సేఫ్టీ కోర్సులో 30 సీట్లు, 4 నెలల వ్యవధితో ఆఫీస్ ఆటోమేషన్ కోర్సులో 20 సీట్లు, 3 నెలల వ్యవధితో కెమికల్ సూపర్‌వైజరీ ప్రోగ్రామ్‌లో 20 సీట్లు ఉన్నాయన్నారు. ఈ కోర్సుల్లో చేరేందుకు ఆసక్తి ఉన్నవారు టెన్త్ పాస్/డిప్లొమా/ఇంటర్/డిగ్రీ సర్టిఫికెట్, ఆధార్, రెండేళ్ల పారిశ్రామిక అనుభవ ధ్రువీకరణపత్రం ఒరిజినల్‌తో పాటు ఒక సెట్ జెరాక్స్‌తో ఆ రోజు ఉదయం 10గంటలకు నేరుగా గైస్ కార్యాలయానికి హాజరు కావాల్సిందిగా కోరారు.

సీజీఆర్‌ఎఫ్‌తో 'విద్యుత్' సమస్యల పరిష్కారం

సీతంపేట(విశాఖ): విద్యుత్ సర్వీస్ కనెక్షన్ ఇవ్వకుండా ఇబ్బంది పెట్టినా, డబ్బులు డిమాండ్ చేసినా, బిల్లింగ్ లోపాలు, విద్యుత్ మీటర్లలో సమస్యలున్నా విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక(సీజీఆర్‌ఎఫ్)కు ఫిర్యాదు చేయాల్సిందిగా సీజీఆర్‌ఎఫ్ చైర్‌పర్సన్, విశ్రాంత న్యాయమూర్తి డాక్టర్ బి.సత్యనారాయణ తెలిపారు. అక్కయ్యపాలెం 80 అడుగుల రోడ్‌లోని గౌరీ కల్యాణ మండపంలో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీటర్లు కాలిపోవడం, విద్యుత్ వోల్టేజి హెచ్చుతగ్గులు, విద్యుత్ మీటర్లలో లోపాలు, అదనపు లోడు మంజూరు, యజమాని పేరు మార్పు, కొత్త విద్యుత్ సర్వీసులు వంటి ఏ సమస్య అయినా సీతమ్మధార ఈపీడీసీఎల్ కార్యాలయంలోని సీజీఆర్‌ఎఫ్‌కు నేరుగా రాత పూర్వకంగా గాని, ఆన్‌లైన్, వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు. సీజీఆర్‌ఎఫ్‌కు 2004 నుంచి ఇప్పటి వరకు 8442 ఫిర్యాదులు రాగా వాటిలో 8367 ఫిర్యాదులను పరిష్కరించినట్లు తెలిపారు.

మురిసేలా మిరియం



గుర్రగరువులో మిరియాలు సేకరిస్తున్న గిరిజనులు



మోదాపల్లిలో విరగ్గాసిన మిరియాలు



ఎండు మిరియాలు

సాక్షి,పాడేరు: జిల్లాలో కాఫీ తోటల్లో అంతరపంటగా గిరిజన రైతులు సాగుచేస్తున్న మిరియాల పంట విరగ్గాసింది. పాదులకు అధికంగా మిరియాల కాపు ఉండడంతో గిరిజన రైతులు మురిసిపోతున్నారు.నాణ్యతలో నంబర్–1గా జాతీయ స్థాయిలో గుర్తింపు ఉన్న మన్యం మిరియాలు ఈఏడాది కూడా గిరిజన రైతులకు అధిక లాభాలు అందించనున్నాయి. కేరళ,కర్నాటక,తమిళనాడు,ఒడిశా రాష్ట్రాలలో మిరియాల పంట ఉన్నప్పటికీ అల్లూరి జిల్లాలో గిరిజనులు సేంద్రియ పద్ధతిలో సాగుచేస్తున్న మిరియాలే నాణ్యతలో నంబర్ వన్‌గా నిలుస్తున్నాయి. ఘాటు అధికంగా ఉండే మన్యం మిరియాలకు జాతీయ మార్కెట్‌లో మంచి ఆదరణ ఉంది. గత ఏడాది కిలో రూ.600 నుంచి రూ.700ధరతో వ్యాపారులు కొనుగోలు చేశారు.

1.10 లక్షల ఎకరాల్లో సాగు

జిల్లాలో 1.48 లక్షల ఎకరాల్లో ఫలసాయం ఇచ్చే కాఫీతోటలను గిరిజనులు సాగు చేస్తున్నారు. వాటిలో 1.10 లక్షల ఎకరాల్లో మిరియాల పాదులను అంతరపంటగా వేశారు.ఎకరానికి తక్కువలో చూసుకున్న 100 కిలోల ఎండు మిరియాలను రైతులు మార్కెటింగ్ చేస్తారు. ఎకరానికి రూ.60వేల నుంచి రూ.70వేల వరకు ఆదాయం లభిస్తుంది.గత ఏడాది 11వేల టన్నుల వరకు దిగుబడి వచ్చింది.ప్రైవేట్ వ్యాపారులు పోటాపోటీగా కొనుగోలు చేశారు. ఈ ఏడాది కూడా వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉండడంతో మిరియాల పాదులకు కాపు విరగ్గాసింది. దిగుబడులు మరింత పెరిగి కనీసం 12వేల టన్నుల వరకు మార్కెట్ జరుగుతుందని ఉద్యానవన,కాఫీబోర్డు, స్పైసెస్ బోర్డు అధికారులు అంచాన వేస్తున్నారు.

మిరియాల సేకరణ ప్రారంభం : మిరియాల పాదులకు ఉన్న గింజల సేకరణను గిరిజన రైతులు ప్రారంభించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో స్పైసెస్ బోర్డు,పాడేరు ఐటీడీఏలు అల్యూమినియం నిచ్చెనలను పంపిణీ చేయడంతో గిరిజన రైతులకు ఎంతో మేలు జరిగింది. వాటితోనే మిరియాలను సేకరిస్తున్న గిరిజన రైతులు వెనువెంటనే వేడినీళ్లలో నానబెట్టి ఎండు మిరియాలను తయారు చేస్తున్నారు. గింజల్లో తేమ పూర్తిగా పోయిన తరువాత రైతులు సంతల్లో అమ్మకాలు చేపడుతున్నారు.

కిలో రూ.550 ధరతో కొనుగోళ్లు ప్రారంభం

జిల్లాలో మిరియాల వ్యాపారం ప్రారంభమైంది. ప్రారంభ దశ కావడంతో వ్యాపారులు కిలో రూ.550ధరతో కొనుగోలు చేస్తున్నారు.ఈ ఏడాది కూడా మన్యం మిరియాలకు డిమాండ్ అధికంగా ఉందని పెద్ద వ్యాపారులు చెబుతున్న నేపథ్యంలో వచ్చే వారం నుంచి ధరలు పెంచి వ్యాపారులు పోటాపోటీగా కొనుగోలు చేసే అవకాశం ఉంది. అయితే కాఫీ పంట వలే మిరియాలను కూడా జీసీసీ,పాడేరు ఐటీడీఏలు కొనుగోలు చేయాలని గిరిజన రైతులు డిమాండ్ చేస్తున్నారు.

ప్రభుత్వమే కొనుగోలు చేయాలి



కాఫీ గింజల మాదిరిగానే మిరియాలకు ప్రభుత్వం గిట్టుబాటు ధరలు ప్రకటించి జీసీసీ,ఐటీడీఏలతో కొనుగోలు చేయించాలి. జాతీయ మార్కెట్‌లో కిలో రూ.1,000 ధరతో గత ఏడాది మిరియాల అమ్మకాలు జరిగాయి. మిరియాల గింజలకు మార్కెటింగ్,గిట్టుబాటు ధర కల్పించే బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలి.

– పాలికి లక్కు, కాఫీ రైతుల సంఘం జాతీయ నాయకుడు, గుర్రగరువు, పాడేరు మండలం

గత ఏడాది మోసపోయాను



గత ఏడాది సీజన్ ప్రారంభంలో వ్యాపారులకు తక్కువ ధరతో మిరియాలను అమ్ముకుని మోసపోయాను. కిలో రూ.550ధరతో కొన్న వ్యాపారులు తూకంలోనూ మోసం చేశారు.ఐటీడీఏ అధికారులు సంతల్లో తూకం కేంద్రాలను ఏర్పాటు చేసి, మిరియాలకు గిట్టుబాటు ధర కల్పించాలి

– దూసూరి కర్రన్న, మిరియాల రైతు, హుకుంపేట

గిట్టుబాటు ధర కల్పిస్తాం



నాణ్యతలో నంబర్–1గా నిలుస్తున్న జిల్లాలో సాగవుతున్న మిరియాలకు గిట్టుబాటు ధర కల్పిస్తాం. మిరియాల మార్కెటింగ్‌కు సంబంధించి అధికారులతో కమిటీ వేస్తాం. జాతీయ స్థాయిలో మిరియాల వ్యాపారులతోను ఈ కమిటీ చర్చలు జరిపి అధిక ధరలతో కొనుగోలు చేసేలా ఏర్పాట్లు చేస్తాం.ఈఏడాది మిరియాల కాపు ఆశాజనకంగా ఉంది.

– ఎ.ఎస్.దినేష్‌కుమార్, కలెక్టర్

పారదర్శకంగా ఎమ్మెల్సీ ఎన్నికలు

డీఆర్‌వో పద్మలత



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న డీఆర్‌వో పద్మలత

సాక్షి,పాడేరు: ఎన్నికల సంఘం నిబంధనలను పక్కాగా అమలు చేసి, పారదర్శకంగా ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలను నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.పద్మలత ఆదేశించారు. కలెక్టరేట్‌లో పోలింగ్ నిర్వహణపై పీవోలు,ఏపీవోలకు మంగళవారం ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సిబ్బంది సమన్వయంతో పనిచేసి, ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా కృషి చేయాలన్నారు. బ్యాలెట్ పత్రాల వినియోగం, బ్యాలెట్ బాక్సుల నిర్వహణ,సీళ్ల వేయడం తదితర ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలన్నారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి సేకరించిన పోలింగ్ సామగ్రి సక్రమంగా ఉన్నదీ లేనిదీ ముందుగానే పరిశీలించాలని సూచించారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన సమయానికి పోలింగ్ ప్రక్రియ ప్రారంభించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఎస్‌డీసీ లోకేష్, మాస్టర్ ట్రైనర్లు చెల్లయ్య, సూపరింటెండెంట్ తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

వారం రోజుల్లో మోస్తరు వర్షాలు

చింతపల్లి: రాగల వారంరోజుల్లో జిల్లాలోని పలు మండలాల్లో చిరుజల్లులతోపాటు ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి మంగళవారం తెలిపారు. వాతావరణంలో ఏర్పడిన మార్పుల కారణంగా కొన్ని చోట్ల చిరుజల్లులు కురుస్తాయని, తేమతోకూడిన వాతావరణం ఉంటుందని చెప్పారు. మరికొన్ని చోట్ల మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు.

సరియాపల్లిలో 20 మందికి అస్వస్థత

- వాంతులు, విరోచనాలతో ఒకే రోజు చిన్నారితో సహా ఇద్దరి మృతి
- భయాందోళనలో గ్రామస్తులు
- ప్రత్యేక మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి



సరియాపల్లిలో వాంతులు, విరోచనాలతో బాధపడుతున్న చిన్నారులతో వారి తల్లులు



పరిస్థితి విషమంగా ఉన్న కోర్రా హర్షిత్



అస్వస్థతకు గురైన వంతాల సిద్ధాంత్

ముంచంగిపుట్టు: మండలంలోని బంగారుమెట్ట పంచాయతీ సరియాపల్లిలో 20 మంది అస్వస్థతకు గురయ్యారు. చిన్నా,పెద్ద అనే తేడా లేకుండా చాలా మంది వాంతులు,విరోచనాలతో బాధపడుతున్నారు. వాంతులు, విరోచనాలతో ఒకే రోజు ఇద్దరు మృతి చెందడంతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు.మంగళవారం ఉదయం గ్రామానికి చెందిన గోల్లోరి దనియా(56), సాయంత్రం ఏడాది బాలుడు కిలో వినయ్ వాంతులు,విరోచనాలతో మృతి చెందారు. ప్రస్తుతం గ్రామంలో కొర్రా విక్రత్,కొర్రా హర్షిత్,వంతాల సిద్ధాంత్,కొర్రా వసంత అనే ఏడాది లోపు చిన్నారులతో పాటు మరికొంత మంది వాంతలు,విరోచనాలతో బాధపడుతున్నారు. చిన్నారులకు శరీరంపై పుండ్లు ఏర్పడ్డాయి. చాలా మంది 10 రోజులుగా అస్వస్థతతో మంచం పట్టారు. ఇటీవల కిలగాడ వైద్యసిబ్బంది గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించి, వైద్యసేవలు అందించినా అదుపులోకి రాకపోవడంతో గ్రామస్తులకు కంటిమీదకునుకు కరువైంది. తక్షణమే వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు స్పందించి ప్రత్యేక మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేయాలని బంగారుమెట్ట సర్పంచ్ రత్న,వైఎస్సార్‌సీపీ మండల నేత మోహన్,సరియాపల్లి గ్రామస్తులు కోరారు.దీనిపై కిలగాడ వైద్యాధికారి రమేష్ వద్ద ప్రస్తవించగా సరియాపల్లిలో గత వారం వైద్య శిబిరం నిర్వహించామని, బుధవారం మరోసారి శిబిరం నిర్వహిస్తామని తెలిపారు. అవసరమైతే పీహెచ్‌సీకి తీసుకువచ్చి వైద్య సేవలు అందిస్తామన్నారు.

ఇలా అయితే.. టెన్త్ ఎలా పాసవుతారు ?

- పాడేరు ఐటీడీఏ పీవో, జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్ ఆగ్రహం
- బందవీధి, జి.మాడుగుల గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల తనిఖీ
- ప్రశ్నలకు విద్యార్థులు సమాధానం చెప్పలేకపోవడంతో అసంతృప్తి



జి.మాడుగుల బాలుర ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల విద్యా ప్రమాణాలను పరిశీలిస్తున్న అభిషేక్‌గౌడ



బందవీధి ఆశ్రమపాఠశాలలో విద్యార్థినులను ప్రశ్నిస్తున్న జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ

జి.మాడుగుల: కనీస స్థాయిలో కూడా విద్యార్థులు సమాధానాలు చెప్పడం లేదని, ఇలా అయితే పదో తరగతి పరీక్షలు ఎలా పాసవుతారని పాడేరు ఐటీడీఏ పీవో, జాయింట్ కలెక్టర్ ఎం.జె.అభిషేక్ గౌడ ఉపాధ్యాయులను ప్రశ్నించారు. ఆయన మంగళవారం మండలంలోని బందవీధి, జి.మాడుగులలో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. బందవీధి బాలికల ఆశ్రమపాఠశాలలో 8,10వ తరగతుల విద్యార్థులకు పలు ప్రశ్నలు వేయగా ఎవరూ సరైన సమాధానం చెప్పకపోవడంతో ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలా ఉంటే 10వ తరగతి పరీక్షలు ఎలా పాస్ అవుతారని ప్రశ్నించారు. మెరుగైన బోధన చేయాలని, విద్యా ప్రమాణాల మెరుగుపడకపోతే సస్పెండ్ చేసానని ఆయన ఉపాధ్యాయులను హెచ్చరించారు. విద్యార్థులకు పల్లీ చెక్కీ, రాగీమాల్ట్ అందజేయక పోవడంతో వార్డెన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన మెనూ అమలు చేయడంలో అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వంటగదిని పరిశీలించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. అనంతరం జి.మాడుగుల ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాల–1ను తనిఖీ చేశారు. విద్యార్థుల విద్యాప్రమాణాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మెనూపై విద్యార్థులను ఆరా తీశారు. చికెన్‌కు బదులు స్వీటు, వెజిటేరియన్ కర్రీ విద్యార్థులకు అదనంగా అందజేయాలని ఆదేశించారు. స్టడీ అవర్‌లో ఉండవలసిన ఉపాధ్యాయులు అందుబాటులో లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. డీడీ ఎల్.రజని తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు సత్వరం పూర్తి

కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశం



కాలనీని పరిశీలించేందుకు నిచ్చెన సాయంతో పైకి ఎక్కుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్





కోళ్లు, మేక పిల్లను పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

రంపచోడవరం/దేవీపట్నం: పోలవరం ప్రాజెక్టు పునరావాస కాలనీల్లో పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఎ.ఎస్ దినేష్‌కుమార్ ఆదేశించారు. దేవీపట్నం మండలంలోని పునరావాస కాలనీలను మంగళవారం ఆయన సందర్శించారు. పెండింగ్‌లో ఉన్న ఆర్‌అండ్‌ఆర్ పనులు వెంటనే పూర్తి చేయాలన్నారు. పూర్తిస్థాయిలో ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ మంజూరు చేయాలని కొంతమంది నిర్వాసితులు కలెక్టర్‌ను కోరారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ నిబంధనల ప్రకారం దర్యాప్తు చేసి అర్హతలను బట్టి ప్యాకేజీ అమలుకు చర్యలు తీసుకొంటామని తెలిపారు. పినికిలపాడు, కొండమొదలు, తాళ్లూరు, మెట్టగూడెం తదితర కాలనీలను పరిశీలించారు. కొండమొదలు కాలనీలో నిచ్చెన సాయంతో మేడపైకి ఎక్కి కాలనీ అంతా పరిశీలించారు. కలెక్టర్ వెంట ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం, సబ్ కలెక్టర్ కల్పశ్రీ,తహసీల్దార్ కరక సత్యనారాయణ, ఎంపీడీవో రత్నకుమారి, డీటీ త్రిమూర్తులు, ఈఈ శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

గిరిజన రైతుల ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలి

రంపచోడవరం: గిరిజన రైతులు ఆర్థికంగా బలోపేతమయ్యేలా కృషి విజ్ఞాన కేంద్రం, ఉద్యానవన పరిశోధన స్థానాల శాస్త్రవేత్తలు కృషి చేయాలని కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్ తెలిపారు. మెరుగైన సాంకేతిక పరిజ్ఞానం అందించి తద్వారా, అధిక దిగుబడులు సాధించేలా ప్రోత్సహించాలని సూచించారు. పందిరిమామిడి కేవీకేను మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గిరిజన రైతుల నుంచి సేకరించిన తాటి, జీలుగు నీరా మంచి ఆరోగ్యకమైనదన్నారు. కేవీకే ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాన్ని పరిశీలించి, మత్స్యశాస్త్రవేత్త వీరాంజనేయులతో మాట్లాడారు. ఏడాదికి ఎన్ని వేల నారు చేప పిల్లలను ఉత్పత్తి చేస్తున్నారో తెలుసుకున్నారు. రైతులకు పంపిణీ చేసే కోడి పిల్లలను, మేకలను కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం, సబ్‌కలెక్టర్ కల్పశ్రీ, కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ రాజేంద్రప్రసాద్, హెచ్‌ఆర్‌ఎస్ హెడ్ పీసీ వెంగయ్య, శాస్త్రవేత్తలు క్రాంతికుమార్, ప్రవీణ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

నాలుగు వేల ఎకరాల్లో పండ్ల తోటల పెంపకం

- చింతపల్లి ఏపీడీ సీతయ్య

కొయ్యూరు: చింతపల్లి క్లస్టర్ పరిధిలో 2025–26 సంవత్సరానికి సంబంధించి కొయ్యూరు, గూ డెంకొత్తవీధి, చింతపల్లి మండలాల్లో నాలుగు వేల ఎకరాల్లో పండ్ల తోటలు పెంచాలని లక్ష్యంగా నిర్ణయించినట్టు ఉపాధి హామీ పథకం క్లస్టర్ ఏపీడీ లాలం సీతయ్య తెలిపారు. స్థానిక ఉపాధిహామీ కార్యాలయాన్ని ఆయన మంగళవారం సందర్శించారు. ఏపీవో అప్పలరాజుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. 2024–25 సంవత్సరానికి సంబంధించి కొయ్యూరులో 780 ఎకరాల్లో నాటేందుకు రైతులకు పండ్ల మొక్కలు అందజేస్తున్నట్టు చెప్పారు. వీటిలో 250 ఎకరాల్లో నాటేందుకు సిల్వర్ ఓక్, 130 ఎకరాల్లో వేసేందుకు కొబ్బరి, 370 ఎకరాల్లో వేసేందుకు జీడి మామిడి మొక్కలు ఇస్తున్నట్టు చెప్పారు. గూడెంకొత్తవీధి మండలంలో 830 ఎకరాల్లో పలు రకాల పండ్ల మొక్కలు నాటనున్నట్టు చెప్పారు. వీటిలో అవకాడో 73 ఎకరాలు, జీడి 70 ఎకరాలు, స్వీట్ ఆరెంజ్ 150 ఎకరాలు, మిలిగిన ఎకరాల్లో సిల్వర్ ఓక్ నాటనున్నట్టు చెప్పారు.చింతపల్లిలో 1,932 ఎకరాలు కేటాయిస్తే 273 ఎకరాల్లో అవకాడో, 54 ఎకరాల్లో డ్రాగన్ ఫ్రూట్, 84 ఎకరాల్లో సపోట, 12 ఎకరాల్లో జాఫ్రా, మిగిలిన ఎకరాల్లో సిల్వర్ ఓక్ వేయనున్నట్టు చెప్పారు.కొయ్యూరు మండలంలో 1500 ఇంకుడు గుంతలు తవ్వాలన్నది లక్ష్యం కాగా, ఇప్పటి వరకు 885 మంజూరయ్యాయని, వాటిలో 300 గుంతల పనులు చేపట్టారని తెలిపారు.

రంగురాళ్లు తవ్వుతున్న 10 మంది అరెస్ట్



స్వాధీనం చేసుకున్న రంగురాళ్లు



నిందితులతో పెదవలస రేంజ్ అధికారి శివరంజని

చింతపల్లి: చింతపల్లి అటవీశాఖ సబ్ డివిజన్ పరిధిలో గల సిగనాపల్లిలో అక్రమంగా రంగురాళ్లు తవ్వుతున్న 10 మందిని అరెస్టు చేసినట్టు పెదవలస రేంజ్ అధికారి శివరంజని తెలిపారు. జీకే వీధి మండలం సంకాడ పంచాయతీ పరిధిలో గల సిగనాపల్లి సమీపంలో కొండపై రంగురాళ్ల తవ్వకాలు జరుగుతున్నట్టు అందిన సమాచారం మేరకు మంగళవారం సిబ్బందితో దాడి చేసినట్టు చెప్పారు. రంగురాళ్లు తవ్వుతున్న కాకినాడ జిల్లా పత్తిపాడు మండలం ఒమ్మంగి గ్రామానికి చెందిన 10 మందిని అరెస్టు చేసి, వారి నుంచి 2.2 గ్రాముల రంగురాళ్లను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. రంగురాళ్ల క్వారీ వద్ద విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇద్దరు ప్రొడక్షన్ వాచర్లను విధుల నుంచి తొలగించినట్టు రేంజ్ అధికారి శివరంజని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఫారెస్టు బీట్ ఆఫీసర్ గోపి,స్ట్రైకింగ్ ఫోర్స్,బేస్ క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు.

మెరుగైన సేవలందించడమే లక్ష్యం



మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి



శిక్షణకు హాజరైన అంగన్‌వాడీ కార్యకర్తలు

ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి

పాడేరు రూరల్: మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు ఆరు రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు ఐసీడీఏ పీడీ సూర్యలక్ష్మి తెలిపారు. మండల కేంద్రం పాడేరులోని శ్రీకృష్ణాపురం ఆశ్రమ పాఠశాలలో మంగళవారం ఆమె శిక్షణ తరగతులు ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు పూర్తిస్థాయిలో అవగాహన కలిగిఉండాలని చెప్పారు. చిన్నారులకు మెరుగైన సేవలందించేందుకు శిక్షణ దోహదపడుతుందని తెలిపారు. పౌష్టికాహారాన్ని చిన్నారులు, గర్భిణులు, కిషోరబాలికలు,బాలింతలకు సకాలంలో అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో–1 విశ్వప్రసాద్, ఐసీడీఎస్ సీడీపీవో రఘూన్సీరాణి పాల్గొన్నారు.

క్లుప్తంగా

24 కేసుల మద్యం స్వాధీనం

చింతూరు: వై.రామవరం మండలం డొంకరాయిలోని ఓ బెల్టుషాపునకు అక్రమంగా తరలించేందుకు లోడ్ చేస్తున్న 24 కేసుల మద్యాన్ని చింతూరు ఎక్సైజ్ పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. రాజమండ్రి నుంచి చింతూరులోని మద్యం దుకాణాలకు సరఫరా చేసేందుకు ఓ వ్యానులో మద్యం కేసులు వచ్చాయి. ఈ క్రమంలో ఓ దుకాణం వద్ద వ్యానులో నుంచి ఆటోలోకి మద్యం కేసులను లోడు చేస్తున్న సమాచారం అందుకున్న ఎక్సైజ్ పోలీసులు అక్కడికి చేరుకుని మద్యం లోడుతో ఉన్న ఆటోను స్వాధీనం చేసుకున్నారు. వై.రామవరం మండలం చవిటిదిబ్బలులోని మద్యం దుకాణానికి వెళ్లాల్సిన మద్యం కేసులను డొంకరాయిలోని బెల్టు షాపునకు తరలించేందుకు చింతూరులో ఆటోలో లోడు చేస్తుండగా దాడిచేసి స్వాధీనం చేసుకున్నట్టు చింతూరు ఎక్సైజ్ ఎస్‌ఐ స్వామి తెలిపారు. ఆటోలో లోడుచేసిన రూ.1.12 లక్షల విలువైన 13 బీరు కేసులు, 11 లిక్కరు కేసులను స్వాధీనం చేసుకుని ఆటోడ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చెట్టుపై నుంచి జారిపడి యువకుడికి గాయాలు


క్షతగాత్రుడిని 108లో ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

దుంబ్రిగుడ: కట్టెల కోసం చెట్టెక్కిన ఓ గిరిజన యువకుడు ప్రమాదవశాత్తు జారిపడి గాయాలు పాలైన సంఘటన మండలంలోని లైగండ పంచాయతీ ఇసుకగరువలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన తాంగుల ప్రశాంత్‌కుమార్ ఉదయం వంట చెసుకునేందుకు కట్టెలు సేకరణకు చెట్టెక్కాడు. కట్టెలు కొట్టే క్రమంలో ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి జారిపడ్డాడు. ప్రమాదంలో కుడి కాలు విరిగి తీవ్ర రక్తస్రావంతో కొట్టుమిట్టడుతుండగా కుటుంబీకులు హుటాహుటిన 108కు సమాచారం ఇచ్చారు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రుడికి సిబ్బంది అర్జున్, శ్యామ్ ప్రథమ చికిత్స అందించిన అరకులోయ ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ

- యువకుడి మృతి

అచ్యుతాపురం రూరల్: మండలంలోని మడుతూరు కూడలికి కూతవేటు దూరంలో గాజువాక వెళ్లే రహదారిలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఈ ఘటనలో వాకపల్లి రమేష్ (19) యువకుడు మృతి చెందినట్లు పోలీసులు మంగళవారం తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం సాయంత్రం మృతుడు రమేష్ గాజువాక రహదారిలో వెళ్తుండగా ఆర్టీసీ బస్సును ఓవర్ టేక్ చేస్తుండగా మరో ద్విచక్ర వాహనం ఎదురుగా వచ్చి ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అచ్యుతాపురం వైపు వస్తున్న మరో ద్విచక్ర వాహనదారు కాలు విరిగింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


వంతాడపల్లితోటలు మోదమ్మ ఆలయం వద్ద భయపెడుతున్న గోతులు


పాడేరుకు సమీపంలోని వంతాడపల్లి తోటలు వద్ద గోతుల ఆర్‌అండ్‌బీ రోడ్డు


కోట్లగరువు బ్రిడ్జి సమీపంలోని ఆర్‌అండ్‌బీ రోడ్డులో పూర్తిగా కప్పని గోతులు

గజానికో గుంత..!

గుంతలు లేని రహదారులే లక్ష్యం.. సంక్రాంతి నాటిని రోడ్లన్నీ మెరుగుపరుస్తామని కూటమి ప్రభుత్వ ఊదరగొట్టింది. సంక్రాంతి వెళ్లి శివరాత్రి కూడా వచ్చేస్తోంది. కానీ కూటమి నేతల హామీ మాత్రం నెరవేరలేదు. మన్యంలో రహదారులు అత్యంత దారుణంగా ఉన్నాయి. గుంతల పూడ్చివేత పనులు నామమాత్రంగా చేసి చేతులు దులుపుకున్నారు.

– సాక్షి, పాడేరు


పాడేరు ఘాట్‌లోని ఓనూరు జంక్షన్ కాఫీతోటలు ప్రాంతంలో గోతులతో ప్రమాదకరంగా మారిన ఆర్‌అండ్‌బీ రోడ్డు

- సంక్రాంతి నాటికి గుంతలు లేని రహదారులే లక్ష్యమన్న కూటమి ప్రభుత్వం
- శివరాత్రి వచ్చేస్తున్నా ఆ ఊసేలేని వైనం
- పలు చోట్ల భయపెడుతున్న గోతులు
- నక్కలపుట్టు నుంచి కోట్లగరువు వరకు గోతులే గోతులు

పాడేరు నుంచి మైదాన ప్రాంతాలకు వెళ్లే ప్రధాన వడ్డాది రోడ్డులో పలు చోట్ల గుంతలు వాహనచోదకులను భయపెడుతున్నాయి. పాడేరు మెయిన్‌రోడ్డు నుంచి నక్కలపుట్టు సమీపం వరకు రూ.కోటితో రోడ్డు వేసిన ఆర్‌అండ్‌బీ అధికారులు, అక్కడ నుంచి వంతాడపల్లి అటవీశాఖ చెక్‌పోస్టు వరకు కిలోమీటరు అధ్వాన రోడ్డును మాత్రం మరిచిపోయారు. ఈ రోడ్డులో గోతులు అధికంగా ఉండడంతో వాహనాలు నడిపేందుకు వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ఇదే రోడ్డులోని కోట్లగరువు కాలనీ, కోట్లగరువు వంతెన సమీపంలోను గోతులను పూర్తి స్థాయిలో పూడ్చలేదు. ఒక గొయ్యిని పూడ్చి పక్కనే మరిన్ని గోతులను అలాగే వదిలేశారు. పాడేరు ఘాట్‌లోని మోదకొండమ్మతల్లి పాదాలు దాటిన తరువాత ఓనురు జంక్షన్ కాఫీతోటల వద్ద రోడ్డు మధ్యలో పెద్ద గొయ్యి ప్రమాదకరంగా మారింది. కొత్తగా ఘాట్‌లో ప్రయాణించే బైక్ చోదకులు ఈగొయ్యి ప్రాంతంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మైదాన ప్రాంతాలకు పోయే ప్రధాన ఆర్‌అండ్‌బీ రోడ్డు కావడంతో వాహనాల రద్దీ అధికంగా ఉంటుంది. ఈ పరిస్థితుల్లో పూర్తిస్థాయిలో రోడ్డు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని వాహన చోదకులు, ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.

పెండింగ్ పనులకు ప్రతిపాదనలు

పాడేరు–వడ్డాది రోడ్డులో పెండింగ్ పనులకు ప్రభుత్వానికి రూ.2 కోట్లతో ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరు కాగానే నక్కలపుట్టు నుంచి వంతాడపల్లి చెక్‌పోస్టు వరకు రోడ్డు అభివృద్ధి చేస్తాం. పలుచోట్ల గుంతలను పూడ్చివేస్తాం

– బాలసుందరబాబు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, ఆర్‌అండ్‌బీ శాఖ, పాడేరు

రక్తదానంపై అపోహలు వద్దు

కలెక్టర్ దినేష్‌కుమార్


రక్తదాతలకు సర్టిఫికెట్‌లు అందజేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

రంపచోడవరం: రక్తదానం చేయడం ద్వారా అత్యవసర పరిస్థితిల్లో మరొకరి ప్రాణాలను కాపాడేవారవుతారని కలెక్టర్ ఎ.ఎస్. దినేష్‌కుమార్ తెలిపారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. కలెక్టర్, పీవో కట్టా సింహాచలం, సబ్ కలెక్టర్ కల్పశ్రీలు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యువత మూడు నెలలకు ఒకసారి రక్తాన్ని దానం చేయవచ్చన్నారు. అపోహలకు తావు లేకుండా రక్తదానం చేయాలన్నారు. మూడు సంవత్సరాల నుంచి 11 మండలాల్లో 2,560 యూనిట్ల రక్తాన్ని దాతల నుంచి సేకరించినట్టు చెప్పారు. జిల్లాలో రెడ్‌క్రాస్ సొసైటీ ప్రారంభించి మూడు సంవత్సరాలు అవుతోందని, రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా బాల్య వివాహాలు, సికిల్ సెల్ ఎనీమియా, గంజాయి నివారణపై యువతకు అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. రంప గ్రామంలో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో 45 మంది వృద్ధులకు రగ్గులు పంపిణీ చేసినట్టు చెప్పారు. ఈనెల 19న చింతూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్టు తెలిపారు. మొదట కళాశాల ప్రాంగణంలో అల్లూరి విగ్రహానికి కలెక్టర్ పూలమాల వేసి నివాళులర్పించారు. రక్తదానం చేసిన యువతకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ స్టేట్ మెంబర్ బొర్రా నాగరాజు, జిల్లా వైస్ చైర్మన్ ఎస్.గంగరాజు, కార్యదర్శి సభ్యులు ప్రసాద్ నాయుడు, కోఆర్డినేటర్ లోహితాస్, ప్రిన్సిపాల్ వసుధ, డాక్టర్ స్పందన, సొసైటీ మెంబరు మహేష్‌బాబు, అధ్యాపకుడు రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఇంటర్, టెన్త్ పరీక్షలు

కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశం


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

రంపచోడవరం: ప్రశాంత వాతావరణంలో ఇంటర్, టెన్త్ పరీక్షలు నిర్వహించేలా అధికారులు పక్కాగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్ ఆదేశించారు. స్థానిక ఐటీడీఏ సమావేశం హాలులో మంగళవారం ఆర్‌జేడీ, జిల్లా విద్యాశాఖాధికారులు, గిరిజన సంక్షేమ డీడీ,ఎంఈవోలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్చి 16 నుంచి 31 వరకు జరిగే పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పది, ఇంటర్ పరీక్షల్లో మెరుగైన ఫలితాల కోసం వంద రోజుల యాక్షన్ ప్లాన్ ప్రకారం బోధించాలని సూచించారు. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి, ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. ఎట్టిపరిస్థితుల్లో మాస్ కాపీయింగ్ జరగకూడదన్నారు. ఈ సమావేశంలో ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం, సబ్ కలెక్టర్ కె.ఆర్. కల్పశ్రీ,డీఎఫ్‌వో రవీంద్ర ధామల విద్యాశాఖ ఆర్‌జేడీ నాగమణి, ఇంటర్ ఆర్‌జేడీ నరసింహమూర్తి, డీఈవో బి.బ్రహ్మాజీరావు, డీడీ విజయశాంతి, ఏజెన్సీ డీఈవో వై.మల్లేశ్వరరావు, ఏటీడబ్ల్యూవోలు మోహన్‌కృష్ణ, రామతులసి, సుజాత,ఎంఈవోలు ముత్యాలరావు, రామకృష్ణ, తాతబ్బాయి, బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

చర్మవ్యాధులతో బాధపడుతున్న చిన్నారులకు వైద్యం


వనభంగిలో పిల్లలకు వైద్యం అందిస్తున్న వైద్యాధికారి నిఖిల్, వైద్య సిబ్బంది

పెదబయలు: మండలంలోని పెదబయలు పీహెచ్‌సీ పరిధిలోని అరడకోట సబ్ సెంటర్ పరిధిలోని వనభంగి గ్రామంలో నలుగురు చిన్నారులకు చర్మ వ్యాధులు సోకాయి. ముఖంపై తట్టు వచ్చిన తరువాత శరీరం అంత విస్తరించిందని పిల్లల తల్లితండ్రులు తెలిపారు. ఈ విషయం గ్రామస్తులు పెదబయలు పీహెచ్‌సీకి మంగళవారం సమాచారం అందించడంతో వైద్యాధికారి నిఖిల్, సిబ్బంది గ్రామానికి వెళ్లి పిల్లలకు వైద్యం అందించారు. ఒక చిన్నారికి శరీరంలో ఎక్కువ ఇన్ఫెక్షన్ ఉండడంతో మీజిల్స్ వ్యాధి అనే అనుమానంతో రక్త నమూనాలు సేకరించి పాడేరు జిల్లా ఆస్పత్రికి పంపించారు. మొత్తం 12 మంది పిల్లలను పరీక్షించామని, వీరిలో ఇద్దరు పిల్లలకు జ్వరంతో బాధపడుతుండా వైద్యం అందించామని చెప్పారు. పిల్లలకు ఇన్ఫెక్షన్ తగ్గేవరకు అంగన్‌వాడీ కేంద్రానికి పంపించవద్దని సూచించారు. వైద్య సిబ్బంది వెంకటరావు, నర్సింగమూర్తి పిల్లలకు వైద్య సేవలందించారు.

బాలిక ఆత్మహత్య


సాస మృతదేహం

సీతమ్మధార: నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం ఓ బాలిక ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాలివి.. అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ, విష్ణు విల్లా అపార్ట్‌మెంట్‌లో పాల్ కుటుంబం నివాసం ఉంటోంది. ఆయన రామాటాకీస్ దరి ఓ ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం చేస్తున్నారు. అతని భార్య పద్మావతి రైల్వే ఉద్యోగి. వీరికి ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె ఇంటర్ చదువుతుండగా, రెండో కుమార్తె కె.సాస(15) పదో తరగతి మధ్యలో ఆపేసింది. సాస ఎవరితో పెద్దగా కలిసేది కాదు. తల్లిదండ్రులతో కూడా ముభావంగా ఉండేది. గత ఏడాది సెప్టెంబర్‌లో స్కూల్ నుంచి టీసీ తీసుకున్న తర్వాత ఇంట్లోనే ఉంటోంది. ఇదిలా ఉండగా మంగళవారం మధ్యాహ్నం తన చిన్ననాటి స్నేహితురాలికి ఫోన్ చేసి ఇంటికి రమ్మని పిలిచింది. కానీ ఆమె తన ఇంటికి రావాలని ఆహ్వానించింది. తనకు కడుపునొప్పి వస్తోందని, నువ్వే రావాలని సాస ఆమెను కోరింది. మధ్యాహ్నం 3 గంటల సమయంలో కుమార్తెకు తల్లి నిమ్మరసం ఇచ్చింది. ఆ తర్వాత తల్లి, నాన్నమ్మ ఇంట్లో ఉన్న సమయంలో బాలిక నాలుగో అంతస్తుకు చేరుకుంది. వాటర్ ట్యాంక్‌పై కళ్లద్దాలు, మొబైల్ ఫోన్ పెట్టి.. అక్కడి నుంచి కిందకు దూకేసింది. ఆమె స్నేహితురాలు ఇంటికి వచ్చి సాస కోసం అడగ్గా బయటకు వెళ్లిందని వారు చెప్పారు. అంతలోనే అందరూ బయటకు వెళ్లి చూడగా సాస నిర్జీవంగా కనిపించింది. వెంటనే బాలికను రైల్వే ఆస్పత్రికి తీసుకెళ్లగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. బాలిక ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. ఇన్‌చార్జి సీఐ దాలిబాబు పర్యవేక్షణలో ఎస్‌ఐ చిన్నంనాయుడు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బంగారం చోరీ కేసులో నిందితుడికి రిమాండ్

అనకాపల్లి: దొంగతనం కేసులో తప్పించుకుని తిరుగుతున్న మండలంలో మాకవరం గ్రామానికి చెందిన గంజి మంగరావును మండలంలో మార్టూరు జంక్షన్ వద్ద పోలీసులు పట్టుకున్నారు. అతడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించినట్లు రూరల్ సీఐ జి.అశోక్‌కుమార్ మంగళవారం తెలిపారు. మండలంలో పెదమాకవరం గ్రామానికి చెందిన దాసరి నారాయణరావు ఇంట్లో ఈ నెల 13న రెండు తులాలు బంగారం చోరీకి గురైనట్లు అతడి మనవరాలు కరణం రేణుక ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా నిందితుడిని పట్టుకుని తులమున్నర బంగారంతోపాటు కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలంలో చోరీ చేసిన బైక్(యూనీకాన్ బైక్)ను స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో రూరల్ ఎస్‌ఐ రవికుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాలర్ ఢీకొని యువకుడి దుర్మరణం


మనోహర్ (ఫైల్)

అక్కిరెడ్డిపాలెం: ద్విచక్రవాహనంపై వెళ్తున్న యువకుడిని ట్రాలర్ రూపంలో మృత్యువు కబళించింది. షీలానగర్ పెట్రోల్ బంక్ సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. గాజువాక ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాలివీ.. అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం వెంకయ్యపాలేనికి చెందిన మైలపల్లి మనోహర్ (24) మెరినో సంస్థలో సేల్స్ విభాగంలో పనిచేస్తున్నాడు. విధుల్లో భాగంగా మంగళవారం నగరం నుంచి గాజువాక వైపు బైక్‌పై వెళ్తున్నాడు. షీలానగర్ పెట్రోల్ బంక్ దాటిన తర్వాత వెనుకనే వేగంగా వస్తున్న ట్రాలర్ బైక్‌ను ఢీకొట్టింది. బైక్ అదుపు తప్పడంతో మనోహర్ తూలి లారీ చక్రాల కిందకు వెళ్లిపోయాడు. ఆ సమయంలో మనోహర్ హెల్మెట్ ధరించినా.. లారీ చక్రాల కింద నలిగి హెల్మెట్ ఊడిపోయింది. తలకు, ముఖానికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో గాజువాక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని.. క్షతగాత్రుడిని షీలానగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మార్గమధ్యంలోనే మనోహర్ మృతి చెందాడు. అతని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ కోటేశ్వరరావు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మనోహర్‌కు తండ్రి మైలపల్లి దేముడు, తల్లి దేముడమ్మ, ఒక సోదరి ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యార్థులను దండించిన

ఉపాధ్యాయులకు నోటీసులు


ఏకలవ్య విద్యార్థులను విచారిస్తున్న అధికారులు


జరిగిన సంఘటనపై ఉపాధ్యాయులను విచారిస్తున్న అధికారులు

చింతపల్లి: చింతపల్లిలోని ఈఎంఆర్ ఏకలవ్య పాఠశాలలో చదువుకుంటున్న బాలికలను అక్కడే చదువుకుంటున్న విద్యార్థులు ర్యాగింగ్ చేయగా.. ఆ విద్యార్థులను ఉపాధ్యాయులు దండించడం వివాదాస్పదంగా మారింది. ఈ ఘటన ఈనెల 11వ తేదీన జరిగినప్పటికీ ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీనిపై అధికారులు మంగళవారం విచారణ చేపట్టారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఏకలవ్య పాఠశాలలో కొంతమంది బాలురు..8వ తరగతి చదువుతున్న బాలికలను ర్యాగింగ్ చేసినట్టు ఉపాధ్యాయులకు ఫిర్యాదు అందింది. దీనిపై ఉపాధ్యాయులు ఆగ్రహించి సంబంధిత విద్యార్థులను ఈనెల 11వ తేదీ రాత్రి సుమారు రెండు గంటల పాటు మోకాళ్లపై కూర్చోబెట్టారు. ఇదిలావుండగా తమ పిల్లలను చూసేందుకు సోమవారం విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలకు వచ్చారు. దీంతో ఉపాధ్యాయులు దండించిన విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పి బోరున విలపించారు. ఉపాధ్యాయుల తీరుపై తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ పిల్లలు తప్పు చేస్తే సమాచారం ఇవ్వకుండా ఇలా ఇష్టానుసారం హింసించడం ఏంటని ప్రశ్నించారు. బాధ్యులపై కఠినచర్యలు తీసుకోవాలని గిరిజన సంక్షేమశాఖ, గురుకుల అధికారులకు ఫిర్యాదులు చేశారు. దీంతో మంగళవారం గురుకుల విభాగం వోఎస్‌డీ పీఎస్ఎన్‌మూర్తి, చింతపల్లి మండల సహాయ గిరిజన సంక్షేమాధికారి జయనాగలక్ష్మి ఏకలవ్య పాఠశాలకు వెళ్లి విచారణ చేపట్టారు. బాలబాలికలతో వేరువేరుగా మాట్లాడారు. ఉపాధ్యాయులను విచారించారు. విద్యార్థులను దండించిన ఉపాధ్యాయులకు మెమోలు జారీ చేశామని సంఘటపై పూర్తిస్థాయి విచారణ చేపట్టి ఉన్నతాధికారులకు నివేదించనున్నట్టు ఏకలవ్య పాఠశాల ప్రిన్సిపల్ మనోజ్‌కుమార్ తెలిపారు.

వీసీ పీఠంపై ఐఐటీ ప్రొఫెసర్

- స్థానికుడికే దక్కిన అవకాశం
- ఏయూ ఉపకులపతిగా ఆచార్య రాజశేఖర్ నియామకం



విశాఖ విద్య/సింహాచలం: ఆంధ్ర యూనివర్సిటీ ఉపకులపతిగా ఆచార్య గంగవంశం పైడి రాజశేఖర్ నియమితులయ్యారు. ఈ మేరకు గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కోన శశిధర్ సంయుక్తంగా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆచార్య రాజశేఖర్ ప్రస్తుతం ఖరగ్‌పూర్ ఐఐటీలో మ్యాథ్స్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. కాగా.. ఆచార్య రాజశేఖర్‌ది సింహాచలం. తమ ప్రాంతీయుడు ఏయూ వీసీగా నియామకం కావడం ఎంతో గర్వకారణమని రాజశేఖర్ స్నేహితులు, సన్నిహితులు, గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. రాజశేఖర్ అడవివరం ప్రాథమికోన్నత పాఠశాలలో ఒకటి నుంచి 7వ తరగతి వరకు చదువుకున్నారు. గ్రీన్‌పార్క్ సమీపంలోని సెయింట్ ఆంథోనీ స్కూల్‌లో 8వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యాభ్యాసం చేశారు. ఏవీఎన్ కళాశాలలో ఇంటర్మీడియట్(ఎంపీసీ), డిగ్రీ(బీఎస్సీ) పూర్తి చేశారు. యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో ఎంఎస్సీ, ఎంఫిల్ పూర్తి చేసి అదే యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందారు. గణితంలో ఆచార్య రాజశేఖర్ చేసిన పరిశోధనలు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందాయి.

కుటుంబ నేపథ్యం

ప్రొఫెసర్ రాజశేఖర్ తండ్రి బలరామకృష్ణ అడవివరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ చేశారు. తల్లి సావిత్రి గృహిణి. రాజశేఖర్ సోదరుడు గిరిధర్ విశాఖ స్టీల్ ప్లాంట్‌లో పనిచేస్తున్నారు. రాజశేఖర్ కుమార్తె కూడా ఖరగ్‌పూర్ ఐఐటీలో విద్యనభ్యసిస్తున్నారు. 2017లో అడవివరంలో జరిగిన గ్రంథాలయ వారోత్సవాల్లో స్థానికులు రాజశేఖర్‌ను ఘనంగా సత్కరించారు. రాజశేఖర్ ఏయూ వీసీగా నియామకం కావడంతో అతని స్నేహితులు పాశర్ల ప్రసాద్, టి.వి.కృష్ణంరాజు, రాజనాల సత్యారావు, వై.డి.వి ప్రసాద్, గ్రామస్తులు కర్రి అప్పలస్వామి, కొలుసు ఈశ్వరరావు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

ఉద్యోగ ప్రస్థానం

- 1997లో యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో గెస్ట్ ఫ్యాకల్టీగా ఉద్యోగ ప్రస్థానం ప్రారంభం..
- 1998 నుంచి 2000 డిసెంబర్ వరకు జపాన్‌లోని టోక్యో యూనివర్సిటీలో పోస్ట్ డాక్టోరల్ ఫెలోగా పని చేశారు.
- 2000 డిసెంబర్ నుంచి 2002 జూన్ వరకు ఐఐటీ ఖరగ్‌పూర్‌లో విజిటింగ్ ఫ్యాకల్టీగా సేవలందించారు.
- 2002 జూన్ నుంచి 2007 ఏప్రిల్ వరకు అక్కడే అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తించారు.
- అనంతరం సెలవులో ఉండి వివిధ అంశాలపై పరిశోధనలు చేశారు.
- 2011 నుంచి 2019 వరకు ఖరగ్‌పూర్ ఐఐటీలోనే ప్రొఫెసర్‌గా పనిచేశారు.
- 2019 ఆగస్టు నుంచి హెచ్ఏజీ స్కేల్‌తో అదే చోట ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు.
- అలాగే ప్రొఫెసర్ రాజశేఖర్ ఖరగ్‌పూర్ ఐఐటీ డీన్‌గా, జేఈఈ మెయిన్స్‌ను ఐఐటీ ఖరగ్‌పూర్ నిర్వహించినప్పుడు చైర్మన్‌గా వ్యవహరించారు.

ఇద్దరు ఆచార్యులకు వీసీలుగా అవకాశం


ప్రసన్నశ్రీ


కూన రాంజీ

ఆంధ్ర యూనివర్సిటీలో విధులు నిర్వర్తిస్తున్న ఇద్దరు ఆచార్యులను రాష్ట్రంలోని వేర్వేరు వర్సిటీలకు వైస్ చాన్సలర్లుగా ప్రభుత్వం నియమించింది. వర్సిటీ విద్యా విభాగంలో పనిచేస్తున్న ఆచార్య కూన రాంజీని మచిలీపట్నం కేంద్రంగా ఉన్న కృష్ణా యూనివర్సిటీకి, ఇంగ్లిష్ విభాగంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ప్రసన్నశ్రీను రాజమండ్రిలోని నన్నయ యూనివర్సిటీకి వీసీలుగా నియమించింది. ఆంధ్ర యూనివర్సిటీ నుంచే ఇద్దరు ఆచార్యులకు వీసీలుగా అవకాశం దక్కడం విశేషం.

వీసీ రిలీవ్

ఏయూ ఇన్‌చార్జి వీసీ బాధ్యతల నుంచి ఆచార్య జి.శశిభూషణరావు మంగళవారం రిలీవ్ అయ్యారు. వర్సిటీకి నూతన వీసీని నియమించిన ప్రభుత్వం.. ప్రస్తుత వీసీ వెంటనే రిలీవ్ కావాలని ఆదేశించింది. ఈ మేరకు శశిభూషణరావు వీసీ బాధ్యతల నుంచి వైదొలగి.. తన మాతృస్థానమైన ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా వెళ్లారు. ఇదిలా ఉండగా ఆచార్య శశిభూషణరావుకు ఏయూ పూర్తి స్థాయి వీసీగా అవకాశం కల్పిస్తారనే ప్రచారం జరిగింది. మరో పక్క వీసీ పోస్టు కోసమని ప్రస్తుత రిజిస్ట్రార్ ఎస్.ధనుంజయరావు, రెక్టార్ కిశోర్‌బాబు తమ స్థాయిలో లాబీయింగ్ చేశారు. కానీ వీరికి అవకాశం దక్కలేదు. వర్సిటీలో కీలక పోస్టుల్లో ఉన్న వీరిని ఇక్కడ కాకుంటే, రాష్ట్రంలోని ఇతర వర్సిటీలకైనా పరిగణలోకి తీసుకుంటారని అంతా భావించారు. కూటమికి చెందిన కీలక నేతలు వీరికి అభయం కూడా ఇచ్చారనే ప్రచారం సాగింది. కానీ ప్రభుత్వం నుంచి వీరికి ఆశాభంగం తప్ప లేదు.

కాగా.. వీసీగా నియమితులైన రాజశేఖర్ ఎప్పుడు విధుల్లో చేరుతారనేది స్పష్టత లేదు. దీనిపై వర్సిటీ వర్గాలకు కూడా సమాచారం లేనట్లుగా తెలుస్తోంది. దీంతో రిజిస్ట్రార్ ధనుంజయరావు పూర్తి స్థాయిలో వర్సిటీ కార్యకలాపాలపై పర్యవేక్షణ చేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి.

247 కిలోల గంజాయి స్వాధీనం

ఇద్దరి అరెస్టు


మాట్లాడుతున్న సీఐ హిమగిరి

అరకులోయటౌన్: మండల కేంద్రం అరకులోయలోని ఎన్టీఆర్ మైదానం సమీపంలో వ్యాన్‌లో తరలిస్తున్న 225 కిలోల గంజాయిని పట్టుకుని, ఇద్దరి అరెస్టు చేసినట్టు సీఐ ఎల్. హిమగిరి తెలిపారు. సిబ్బందితో కలిసి ఎన్టీఆర్ మైదానం సమీపంలో ఈనెల 17న వాహనాలు తనిఖీ చేస్తుండగా బొలెరో వాహనంలో బెంగళూరుకు చెందిన మారప్ప, అనకాపల్లికి చెందిన రాజేష్ గంజాయి తరలిస్తూ పట్టుబడినట్టు చెప్పారు. వీరిని కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించినట్టు సీఐ హిమగిరి తెలిపారు.

గన్నేరుపుట్టులో..

జి.మాడుగుల: ఒక ఇంటి పెరటిలో దాచి ఉంచిన 22 కిలోల గంజాయిని స్థానిక పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మండలంలో కె. కోడాపల్లి పంచాయతీ గన్నేరుపుట్టులో వంతాల మాగు ఇంటి పెరటిలో గంజాయి దాచి ఉంచినట్టు అందిన సమాచారం మేరకు సోమవారం దాడి చేసి స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ కుమార్‌బాబు మంగళవారం తెలిపారు.వంతాల మాగు, వంతాల జగదేశ్వరరావు అనే ఇద్దరిని అరెస్టు చేశామని, మరొకరు పరారీలో ఉన్నారని ఆయన చెప్పారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ రూ.1.10లక్షలు ఉంటుందని తెలిపారు. సీఐ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు నిదింతులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచి, రిమాండ్‌కు తరలించినట్టు ఎస్‌ఐ చెప్పారు.


పట్టుబడిన గంజాయి, నిందితులతో పోలీసులు

సుబ్రహ్మణ్యేశ్వరుడికి విశేష పూజలు

సింహాచలం: అడవివరంలోని విజినిగిరిపాలెంలో ఉన్న వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం స్వామికి విశేష పూజలు జరిగాయి. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం వరకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామికి అభిషేకాలు నిర్వహించారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు.

